క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 84వ రోజు కొనసాగాయి. దీక్షల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు అడ్లూరి శ్రీనివాస్, శ్రీధర్ బాబు కూర్చున్నారు. బోధన్‌ను జిల్లాగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



రుద్రూర్ (కోటగిరి): ప్రసవం కోసం ఓ గర్భిణీ ఆదివారం అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళుతుండగా మార్గమధ్యలో 108 అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా.. కోటగిరికి చెందిన సౌజన్యకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సౌజన్యను కోటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డను ఆస్పత్రిలో చేర్చారు.

రోడ్డు పనులు ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవిందపేట్ గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బండమీది జమున ప్రారంభించారు. ఎంపీటీసీ రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని దత్తాపూర్ గ్రామంలో ఆదివారం నాయకపోడు సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ నాగరాజ్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, నాయకపోడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్‌చందర్, మన్నె సాగర్, నారాగౌడ్, మహేష్, రవి, రాకేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో గల గ్రంథాలయానికి ఆదివారం హైదరాబాద్ బీసీ స్టడీ సర్కిల్ వారు పుస్తకాలను అందజేసినట్లు గ్రంథాలయ పాలకురాలు వరలక్ష్మీ తెలిపారు. గ్రూప్ 1,2,3,4 తెలుగు, ఇంగ్లీష్ మీడియం పుస్తకాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలోని ఓ బాధిత కుటుంబానికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి అందజేశారు. నాయకులు జగడం పోశన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని మానవతసదన్‌లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు సదన్ పిల్లలతో కలిసి కేక్‌ను కట్ చేసి, పంచిపెట్టారు. పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు జక్కుల కరుణాకర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రాజన్న రాజ్యం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు పురం మోహన్, కొండ అరుణ్‌కుమార్, అశ్వక్, రమేష్, సాయిబాబా, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ చేసేదెప్పుడో?

- ఆర్మూర్‌లో ఇరుకు దారులతో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



టెకీ మజిద్‌కు వెళ్లేదారిలో రోడ్లపై వాహనాలు నిలపడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పలు మార్గాల్లో ఇరుకైన రోడ్ల మీదుగా ప్రయాణం చేయడం ప్రయాణికులకు సంకటంగా మారింది. అలాగే పట్టణంలోని పలు కాలనీలకు వెళ్లే అంతర్గత రోడ్లు ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలో రోజురోజుకు జనాభాతో పాటు వాహనల సంఖ్య పెరుగుతోంది. అయినా రహదారుల విస్తరణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలు..

ఆర్మూర్ పట్టణం చుట్టు పక్కల గ్రామాలకు వ్యాపార కేంద్రంగా మారింది. అలాగే అంతర్గత రోడ్లల్లో సైతం వ్యాపార సముదాయలు ప్రారంభం కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. పట్టణంలోని టెకీ మసీదు, పంత్‌రోడ్డు, భారత్ గ్యాస్ వెళ్లే రోడ్డు, హౌసింగ్‌బోర్డు, వెళ్లేదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడుతుంది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే వ్యాపార సముదాయలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపై నిలిపేసి వెళ్తున్నారు. దీంతో రోడ్లపైకి ఏ ఒక్క పెద్ద వాహనం వచ్చిన మిగిలిన అన్ని వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనికితోడు వ్యాపార సముదాయల యాజమనులు తమ దుకాణంకు సంబంధించి బోర్డులు సైతం రోడ్లపై ఏర్పాటు చేయడంతో రాకపోకలకు మరింత అంతరాయం ఏర్పడుతుంది. రోడ్ల విస్తరణ చేసే అవకాశం లేని పక్షంలో మున్సిపల్ అధికారులు వ్యాపార సముదాయల యాజమాన్యాలను రోడ్లపై ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చూసే విధంగా చర్యలు చేపట్టాలని పుర ప్రజలు అంటున్నారు. దీనికి తోడు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సైతం ట్రాఫిక్ అంతయరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని అంటున్నారు.

రోడ్లను విస్తరించాలి..



పట్టణంలోని ఇరుకుగా ఉన్న రోడ్లను విస్తరించాలి. వ్యాపార సముదాయల బోర్డులు సైతం రోడ్లపై ఏర్పాటుచేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ముంది. ప్రధానంగా ఎక్కడా కూడ పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. –శ్రీధర్, ఆర్మూర్

చర్యలు తీసుకుంటాం..



మున్సిపల్ పరిధిలో వ్యాపార సముదాయల ముందు గల రోడ్లపై వాహనాలు, వ్యాపార బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తే జరిమానాలు సైతం విధిస్తాం. –ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులో కబ్జాకు గురైన సుమారు 2ఎకరాల 20గుంటల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కబ్జా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. నాయకులు కొండ గంగాధర్, సాయిలు, శ్రీనివాస్, గోపి, అశోక్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కుద్వాన్‌పూర్ గ్రామం నుంచి తొండకూర్ గ్రామం వరకు ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ కోల్కొండ చిన్నసాయిలు, ఎంపీటీసీ గోదావరి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

మాక్లూర్: నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు గంగాధర్, దేశెట్టి రాధ, సుజాత, మంగమ్మ, ఇంధిర పేర్కొన్నారు. మండలంలోని బోర్గాం (కె)లో ఆదివారం వారు మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మధ్యాహ్నం మహా సభలు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని మహిళలు, బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైలానిబాబా గంధం ఉత్సవాలు



రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామ శివారులో గల సైలానిబాబా గంధం ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. రాత్రి ఉర్సు చిరాగ్, ఖవ్వాలి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు వహీద్‌బాబ తెలిపారు. ఎస్సై సాయన్న పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఆధ్యాత్మికం..

■ సాయి ఆలయంలో యజ్ఞం



నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియా గ్రామంలో గల సాయిబాబా ఆలయంలో ఆదివారం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో వైదిక యజ్ఞం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవాలని, మానవాళి మనుగకు ప్రకృతి సంపద అనుకూలంగా ఉండాలని దేవతామూర్తులను ప్రార్థించారు. ఆర్య సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ పరిధిలో గల 14 ఆపరేషన్ సెక్షన్లలో ఫెయిలైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను రవాణా చేయడానికి 3ఎంటీ పికప్ వ్యాన్ ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని, ట్రాన్స్‌కో డీఈ హరిచంద్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు తమ వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆర్మూర్ జిరాయత్‌నగర్‌లోని విద్యుత్ డీఈ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తెయూలో అవినీతిని అరికట్టాలి



మాట్లాడుతున్న విద్యార్థిసంఘ నాయకులు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, లేదంటే మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇల్లును ముట్టడిస్తామని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు పేర్కొన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. తెయూలో అవినీతి జరుగుతుంటే ప్రజాప్రతినిదులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తెయూలో అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. కార్యక్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భానుచందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా కల్వర్టు



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామం నుంచి వేల్పూర్ వెళ్లే దారిలో వాగు సమీపంలో నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు దెబ్బతినడంతో రోడ్డుకు రంధ్రం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: **భట్టాచార్య,** ఏఈ పంచాయతీరాజ్ శాఖ

ఫోన్ నంబర్ : 8340044801

ప్రజల దృష్టిని మరల్చడానికే ఆరోపణలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): లిక్కర్ స్కాం వ్యవహారంలో ఎమ్మెల్సీ కవిత ఎదుర్కొంటున్న ఈడీ విచారణ నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే బీఆర్ఎస్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆందోళనలకు దిగుతున్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహరెడ్డి అన్నారు. పెర్కిట్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలపై బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడు పెదవి విప్పలేదన్నారు. కానీ కవిత విషయంలో తెలంగాణ యాసలో స్పందించిన బండి సంజయ్ మాటాలను వక్రీకరిస్తూ రాద్దాంతం చేస్తున్నారన్నారు. లిక్కర్‌స్కాం వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, నాయకులు ఖాందేశ్ ప్రశాంత్, సాయి, ప్రశాంత్, ఉదయ్, వాసు, తిరుపతి, పోశెట్టి, గణేష్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను అరెస్టు చేయాలి



కోటగిరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

వర్ని/రుద్రూర్/రెంజల్/ఎడపల్లి: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆదివారం పలు మండలాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వర్ని, కోటగిరి, రెంజల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. అలాగే పలు మండలాల్లో బండి సంజయ్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. ప్రధాన రహదారులపై రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కల్యాపూర్ గ్రామంలో..



ఎడపల్లి మండల కేంద్రంలో..



వర్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌లో వైద్య శిబిరం



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ ఎంజే ఆస్పత్రిలో ఆదివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ మాట్లాడుతూ.. త్వరలో భీంగల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహిళ వైద్యులు మహిళలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, లింగారెడ్డి, ఏలేటి శృతి, గీత పాల్గొన్నారు.

గుత్ప గ్రామంలో..



మాక్లూర్: మండలంలోని గుత్ప గ్రామంలో ఆదివారం సూర్య ఆరోగ్య సంస్థ, దివ్యసాయి, స్మైల్ 32 డెంటల్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్యులను సన్మానించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, సర్పంచ్ గంట చిన్నయ్య, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

సంక్షిప్తం

రుద్రూర్ ఎస్సైకి సన్మానం



రుద్రూర్: రుద్రూర్ విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎస్సై రవీందర్‌ను సన్మానించారు. ఆలయ పునఃప్రారంభోత్సవం, వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు సహకరించడంతో ఎస్సైని సన్మానించినట్లు పేర్కొన్నారు. ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో యువకుల శ్రమదానం

రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం యువకులు శ్రమదానం చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. పూల మొక్కలకు పాదులు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణ దాతకు సత్కారం..



ఎడపల్లి(బోధన్): మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు దాత మల్లాది వెంకటేశ్వర శర్మ రూ.కోటి వెచ్చించి అదనపు తరగతి గదులను నిర్మించి ఇచ్చారు. ఈసందర్భంగా ఆదివారం దాతకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గురుకుల సొసైటీ ఉప కార్యదర్శి పీఎస్ ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలలకు దాతలు తరగతి గదులను కట్టించి ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎంఈవో కొడాలి రామారావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ అంబీరు రాజేంద్రప్రసాద్ రావు, ప్రిన్సిపాల్స్ సుహాసినిరెడ్డి, దేవిసింగ్, కిషన్, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ మాధవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత కోసం హోమం

నిజామాబాద్‌నాగారం: జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత క్షేమం కోసం జాగృతి ప్రతినిధులు సుదర్శన హోమం చేయించారు. నగరంలోని చక్రం గుడిలో ఆదివారం జాగృతి రాష్ట్ర కార్యదర్శి నరాల సుధాకర్ ఆధ్వర్యంలో ఆచార్యులు శ్రీమాన్ నర్సింహమూర్తి(నాని) స్వామి సమక్షంలో సుదర్శన హోమం చేయించారు. ఎమ్మెల్సీ కవిత ప్రజా సేవలో ఎటువంటి ఆటంకాలు రాకుడదని, నర దిష్టి తగలవద్దన్నారు. కవిత శత్రువుల వాంఛ వినాశనం కోసం ప్రత్యేకంగా హోమం చేసిన్నట్లు తెలిపారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు సభ

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామంలోగల శ్రీ విజ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై వంశీకృష్ణారెడ్డి హాజరై, మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.